క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

పెబ్బేరు రూరల్: శ్రీ రంగాపురం ఎస్‌ఐగా వెంకటస్వామి శనివారం బాధ్యతలు చేపట్టారు. జోగులాంబ గద్వాల జిల్లా కోదండాపురంలో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న మల్లేష్ జోగులాంబ గద్వాలకు బదిలీపై వెళ్లారు.

నీరు విడుదల చేయాలి



మదనాపురం: సరళ సాగర్ ఆయకట్టు రైతులకు నారు మడులు పోసుకోవడానికి నీటిని విడుదల చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గజ్జల నాగన్న డిమాండ్ చేసారు. శనివారం నాయకులతో కలసి ప్రాజెక్టును సందర్శించారు. నీరు విడుదల చేయని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. మండల నాయకులు జగదీష్, వడ్డె కృష్ణ, మహేష్ , వడ్డే బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

సోయం బాబురావును బర్తరఫ్ చేయాలి

పాన్‌గల్: రాష్ట్రంలో గిరిజన తెగల నుంచి ఎస్టీ జాబితాల నుంచి లంబాడీలను తొలగించాలని పార్లమెంటు సభ్యులు చేసిన వ్యాఖ్యలకు ఆయన్ను పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు ఠాకూర్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివాసి తెగలు అభివృద్ధికి నోచుకోకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి ఆయా తెగల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. బాబురావు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెబుతామన్నారు.

తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాలప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తున్న నేపథ్యంలో దిగువకు వదులుతున్నారని తహశీల్దార్ సింధూజ పేర్కొన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ మేరకు మండల పరిధిలోని రేచింతల, జూరాల, వీరరాఘవపూర్, ఆరేపల్లి, కత్తేపల్లి తదితర నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నదిలో వేసుకున్న మోటార్లు, వలల కోసం వెళ్లొద్దని పేర్కొన్నారు.

హజ్ యాత్రికుడికి సన్మానం

వనపర్తిటౌన్: హజ్ యాత్ర పూర్తి చేసుకుని పట్టణానికి తిరిగి వచ్చిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సయ్యద్ అఖ్తర్‌ను శనివారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవిని శాలువాతో సన్మానించారు. నాయకుడిగా పార్టీ తరపు నుంచి, ఒక సామాన్య వ్యక్తిగా ప్రజల బాగు కోరే అఖ్తర్ లాంటి వ్యక్తిత్వం కలిగిన నాయకులే ప్రజలకు అవసరమని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షుడు సహదేవ్, జిల్లా పట్టణ మైనార్టీ అధ్యక్షుడు అనీస్, యువజన కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ బాబా, నాయకులు జానంపేట నాగరాజు, అబ్దుల్లా, వెంకట్, ద్యారపోగు విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటివిడుదల

మదనాపురం: వానాకాలం పంట కోసం సరళా సాగర్ ద్వారా నీటి విడుదల చేసేందుకు ఆదివారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రానున్నారని రైతుబంధు మండలాధ్యక్షుడు హనుమాన్‌రావు, జిల్లా కమిటీ సభ్యులు రవీందర్‌రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు.

రోడ్డు బురదమయం



పాన్‌గల్: మండలంలో పదిరోజులుగా కురుస్తున్న వర్షాలతో గుంతలమయంగా మారిన రోడ్లపై వర్షం నీరు చేరి బురదమయంగా మారుతున్నారు. మండలంలోని శాగాపూర్, మాందాపూర్, బండపల్లి, జమ్మాపూర్ గ్రామాలకు ఉన్న రోడ్లు గుంతలమయంగా మారి ప్రయాణానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతలమయంగా మారిన రోడ్డుకు మరమ్మతు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆర్థిక సాయం

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన షాహిన్ బేగం, దివ్యాంగుడైన బాలుడు కురుమూర్తిలకు చెరో రూ.2వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న ఉప్పరి రాంచంద్రయ్య రూ.3వేల చొప్పున జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆర్థికసాయం అందజేయించారు. బీఆర్ఎస్ నాయకులు శనివారం బాధితుల ఇళ్లకు వెళ్లి నగదును అందజేశారు. మండల కోఆప్షన్ ఖాజాఘోరీ, బీఆర్ఎస్ యువత అధ్యక్షుడు బాలరాజు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాహంగీర్, బుడ్డన్న తదితరులు ఉన్నారు.



ఖిల్లాఘనపురం మండలం ఆగారంలో..



ఖిల్లాఘనపురంలో..



కమాలోద్దీన్‌పూర్‌లో..



కొత్తకోట మండలంలో..

వైభవంగా పీర్ల పండుగ



రేవల్లి మండలం తల్పునూరులో పీర్ల ఊరేగింపు

పెబ్బేరు: పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో శనివారం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని అలాయి ఆడారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలల్లో నిర్వహించిన మొహర్రం వేడుకలు శనివారంతో ముగిశాయి. పీర్ల నిమజ్జనం సందర్భంగా ఎస్‌ఐ రవిప్రకాష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో పీర్ల పండగ ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. గోపాల్‌పేట, ఏదుట్ల, ఏదుల, కేశంపేట, రేవల్లి, తల్పునూరు గ్రామాల్లో పీర్లను ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.

ఆత్మకూర్: మండలంలో వేడుకలు శనివారం ముగిశాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొత్తకోట: మొహరం పర్వదినాన్ని పురస్కరించుకొని గాడ్స్ ఆన్ వారియర్స్ షోటోఖాన్ కరాటే అకాడమీ నిర్వాహకులు అబ్దుల్ నబీ షర్బత్ పంపిణీ చేశారు. హరీష్‌యాదవ్, మహబూబ్, బాసిత్, ఫెరోస్, బాబా, అజ్మీర్, గౌస్‌పాష ఉన్నారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం మొహర్రం (పీర్ల పండుగను) ప్రజలు కులమతాలకు అతీతంగా నిర్వహించారు.

కొత్తకోట రూరల్: మండలంలో రాయిణిపేట, రామకృష్ణాపురం, పామాపురం గ్రామాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పీర్లకు మొక్కులు చెల్లించుకున్నారు. రాయిణిపేటలో ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీ రంగాపురం మండలంలోని కంబాళాపురం మొహర్రం వేడుకల్లో మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ పాల్గొన్నారు.



కంభాలాపురంలో వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి చిన్నారెడ్డి



రేచింతలలో..



పిన్నంచర్లలో..



పాన్‌గల్‌లో ..

జోరుగా వరి నాట్లు

పాన్‌గల్: మండలంలో కురుస్తున్న వర్షాలకు ఆయా గ్రామాల్లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాకాలం వరినాట్లు జోరందుకోవడంతో పొలాల వద్ద రైతులు, కూలీల సందడి కనిపించింది. ఈ ప్రాంతంలో వ్యవసాయ ఆధారిత కుటుంబాలే అధికంగా ఉండటంతో రైతులు, మహిళా కూలీలు, యువ రైతులు మూడు రోజులుగా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. మహిళలు తెల్లవారుజామునే పొలాలకు నాట్లు వేసేందుకు వెళ్లి మధ్యాహ్న భోజనం పొలాల్లోనే చేస్తూ.. సాయంత్రానికి ఇంటికి చేరుకుంటున్నారు. ఒకేసారి నాట్లు ప్రారంభం కావడంతో కూలీల కొరత తీవ్రంగా ఉంది. వివిధ ప్రాంతాల నుంచి ఆటోలో కూలీలను తరలిస్తున్నారు. వర్షాలతో ఒకేసారి నాట్లు ప్రారంభం కావడంతో కూలీల డిమాండ్ పెరిగి రేట్లు పెంచుతున్నారు. మండలంలోని 28 గ్రామపంచాయతీల్లో 17,500 ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. భారీ వర్షాలు కురిసి భీమా, కేఎల్‌ఐ కాల్వల ద్వారా సాగునీరు విడుదల చేస్తే సాగు మరింత పెరిగే అవకాశం ఉందని తెలియజేస్తున్నారు.



పాన్‌గల్ మండలం శాగాపూర్‌లో నాటు వేస్తున్న కూలీలు

వినూత్నంగా కార్మికుల నిరసన



పాన్‌గల్‌లో చెట్ల ఆకులు తింటూ నిరసన తెలుపుతున్న కార్మికులు



చిన్నంబావిలో పారిశుద్ధ్య కార్మికులు

పాన్‌గల్: మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా 24వ రోజు శనివారం చెట్ల ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు నాగన్న, సుబ్బయ్య మాట్లాడారు. పంచాయతీ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రమాద బీమా చెల్లించాలని, ఎనిమిది గంటల పనిదినాలను అమలు చేయాలన్నారు. ఏడాదికి రెండు జతల యూనిఫాంలు, సబ్బులు, నూనెలు ప్రతి సంవత్సరం అందించాలన్నారు. దీంతో పాటు కాళ్లకు బూట్లు, చేతులకు గ్లౌజులు ఇతర స్టేఫీ పరికరాలను అందించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం జేఏసీ నాయకులతో చర్చలు జరిపి సమ్మెను కార్మికుల న్యాయమైన కోరికలను పరిష్కారం చేసి సమ్మెను విరమింపజేయాలన్నారు. నాయకులు సుగ్రీవుడు, అంజిరెడ్డి మద్దిలేటి, బాలకిష్టి, శేఖర్, కురుమూర్తి, పెంటయ్య, కసన్, నాగమ్మ పాల్గొన్నారు.

చిన్నంబావి: చిన్నంబావి మండల కేంద్రంలో శనివారం గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికుడు అంజి మాట్లాడారు. నిరసన తెలుపుతున్నా.. ప్రభుత్వం మమ్మల్ని పట్టించుకోవడం లేదని అన్నారు.

ఘనంగా మహనీయుల జయంతి



ఖిల్లాఘనపురంలో పండుగ సాయన్న జయంతి నిర్వహిస్తున్న నాయకులు

వనపర్తిటౌన్: మహనీయుల సేవలు మరువలేనివని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఎదుట పోరాట యోధుడు పండుగ సాయన్న 132వ జయంతిని, సినారె 92వ, జయంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడారు. దొరల పెత్తనాన్ని నిర్మూలించేందుకు పోరాడిన సాయన్న పోరాట స్ఫూర్తిని నేటి యువత అందిపుచ్చుకోవాలన్నారు. ప్రపంచ కవిగా ఎదిగిన సినారె సాహిత్యంలో ఎన్నో రికార్డులు సృష్టించాడని, ఆయన పాటలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కవులు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహ శర్మ, విభూది ఈశ్వర్, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు బండలయ్య, నాయకులు వెంకటేశ్వర్లు, యాదగిరిచారి, రవీందర్‌గౌడ్, పరమేశ్వర చారి, మురళీధర్‌చారి, గంగాధర్ చారి, సత్యం చారి, రమేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆశాజ్యోతి పండుగ సాయన్న..

ఖిల్లాఘనపురం: పేద ప్రజల ఆశాజ్యోతి పండుగ సాయన్న అని జిల్లా మత్స్యకారుల సహకార సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట పండుగ సాయన్న 134వ జయంతి కార్యక్రమాన్ని మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు సాయిలు, వివిధ గ్రామాల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, సభ్యులతో కలిసి పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పండుగ సాయన్న రజాకారులు, భూస్వాములకు వ్యతిరేకంగా పేద ప్రజల కోసం పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామ ముదిరాజ్ సంఘాల నాయకులు రాంచంద్రి, శ్రీను, గోపాల్, అంజనేయులు, చెన్నయ్య, కంపిళ్ల ఆంజనేయులు, మల్లేష్, భద్రు, తిర్మలాయపల్లి భద్రు, లక్ష్మణ్, రాములు తదితరులు పాల్గొన్నారు.



మహనీయుల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న నాయకులు

అభివృద్ధి పనులకు భూమిపూజ

కొల్లాపూర్: పట్టణంలోని వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి శనివారం పర్యటించారు. ఇటీవల వార్డుల వారీగా అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు కావడంతో ఆయా పనులకు ఆమె భూమి పూజ చేశారు. 10, 17 వార్డుల్లో సీసీరోడ్లు, డ్రైయినేజీల నిర్మాణాలు ప్రారంభించారు. ఎమ్మెల్యే సహకారంతో మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నామని వివరించారు.

బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగింత

గోపాల్‌పేట: సుమారు మూడు నెలల కిందట ఏదుట్లకి చెందిన నాగన్న సెల్‌ఫోన్ పోయింది. దీంతో ఆయన గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా నాగన్న సెల్‌ఫోన్ గుర్తించి శనివారం ఆయనకు సెల్‌ఫోన్ అప్పగించామని గోపాల్‌పేట ఎస్‌ఐ వెంకటేశ్వర్లు చెప్పారు. సెల్‌ఫోన్లు జాగ్రత్తగా చూసుకోవాలని, అనుకోకుండా సెల్‌ఫోన్ చోరీకి గురికావడం, పోవడం జరిగితే స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఉద్యోగం సాధించిన వ్యక్తికి సన్మానం




వీపనగండ్ల: మండల పరిధిలోని గోవర్ధనగిరికి చెందిన నిర్మలకృపాకర్‌రెడ్డి దంపతుల కుమారుడైన శివకుమార్‌రెడ్డి ఇటీవల జరిగిన పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకులో ఉద్యోగం సాధించాడు. దీంతో గ్రామంలోని ప్రజాప్రతినిధులు, ప్రజలు శనివారం శివకుమార్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. గ్రామంలోని యువకులు కష్టపడి చదివితే పోటీ పరీక్షల్లో నెగ్గుకురావొచ్చని, దీంతో మంచి పేరు వస్తుందని, అందుకు అవసరమైన సాయం కూడా అందిస్తామని సర్పంచ్ విజయ్‌కుమార్ అన్నారు. గ్రామంలోని యువకులు శివకుమార్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా అతడిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఉప సర్పంచ్ కుర్మయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఆంజనేయులు, ఎల్లస్వామి, లలితమ్మ, కవి తదితరులు పాల్గొన్నారు.

గుడిబండలో తాగునీటి ఎద్దడి



అడ్డాకుల: మండలంలోని గుడిబండలో తాగునీటి ఎద్దడి నెలకొంది. మూడు రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో గ్రామస్తులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గురువారం నుంచి నీళ్లు రాకపోవడంతో శనివారం స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు శకుంతల రెండు ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రదీప్‌ను వివరణ కోరగా ఎల్లూరు వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్నందున సరఫరా నిలిచిందని వివరించారు. శనివారం రాత్రి నుంచి నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. కాగా పంచాయతీకి మోటార్లను సర్పంచ్ ఇతరులకు లీజుకు ఇవ్వడంతో భగీరథ నీరు రానప్పుడు తీవ్ర సమస్య ఏర్పడుతోందని ఎంపీటీసీ ఆరోపిస్తున్నారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇళ్లు



టార్పాలీన్‌లను అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

చిన్నచింతకుంట: కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇళ్లు ఇచ్చారని పార్టీ జిల్లా అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఏదులాపురంలో వర్షానికి కూలిన ఇళ్లను పరిశీలించారు. బాధితులకు ఆర్థికసాయంతో పాటు టార్పాలీన్లను అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పేదలందరికీ ఇళ్లు అందుతాయని పేర్కొన్నారు. యూత్ అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, జాకీర్ ఉన్నారు.

వేధిస్తోందని పీఈటీపై విద్యార్థుల ఫిర్యాదు

• విధుల నుంచి తొలగించిన అధికారులు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని జ్యోతిబా పూలే గురుకులలో గెస్ట్ పీఈటీ శివమ్మను జిల్లా అధికారులు విధుల నుంచి తొలగించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ స్వర్ణలత శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలకు సెలవులు రావడంతో తాను రాలేదని.. కాగా శుక్రవారం పాఠశాల ముందుకు పీర్లు రావడంతో చూడడానికి విద్యార్థులు అందరూ గేటు దగ్గరకి వచ్చారని పేర్కొన్నారు. ఈ క్రమంలో అందరినీ లోపలికి వెళ్లాలని పీఈటీ సూచించారని అన్నారు. కాగా శివమ్మ ఐరన్ స్కేల్ చూపిస్తూ లోపలికి విద్యార్థులను పంపుతున్న క్రమంలో ఆరో తరగతి విద్యార్థి వర్షలత వీపుపై తగిలి గాయమైందన్నారు. శివమ్మ పాఠశాలలో వేధిస్తునట్లు, స్కేల్‌తో కొట్టినట్లు విద్యార్థులు శనివారం ఫిర్యాదు చేశారని వివరించారు. విషయం ఎంజేపీ జిల్లా కోర్డినేటర్ మదనచారి దృష్టికి తీసుకెళ్లగా ఆయన విధుల నుంచి తొలగించారని వివరించారు.

వ్యక్తిత్వ వికాస శిక్షకుడిగా నారాయణ



గంపా నాగేశ్వర్‌రావుచే ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న నారాయణ యాదవ్

వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన ముంత నారాయణ యాదవ్ వ్యక్తిత్వ వికాస ట్రైనర్‌గా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఇన్‌ప్యాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు సికింద్రాబాద్‌లో ఫౌండర్ గంప నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇతనికి వ్యక్తిత్వ వికాస ట్రైనర్‌గా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంచి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తానని ఈ సందర్భంగా ముంత నారాయణ యాదవ్ తెలియజేశారు. కార్యక్రమంలో రాచకొండ సైబర్ క్రైం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పాలమూరు సభకు తరలిరండి



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న అశ్విన్‌కుమార్

ఆత్మకూర్: రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలనకు వీడ్కోలు పలకడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్ కుమార్ అన్నారు. శనివారం ఆత్మకూర్‌లోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. 31న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఈటెల రాజేందర్‌లు హాజరుకానున్న పాలమూర్ బహిరంగ సభకు అధికసంఖ్యలో బీజేపీ శ్రేణులు తరలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ రేచింత శ్రీను, జిల్లా కార్యదర్శి అశోక్‌కుమార్‌జీ, జిల్లా ఉపాధ్యక్షుడు నరాల నారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా రెడ్డి సేవాసమితి



దేవరకద్ర: పేదలకు అండగా రెడ్డి సేవాసమితి కార్యక్రమాలు నిర్వహిస్తోందని జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం దేవరకద్రలో నియోజకవర్గ సమావేశంలో మాట్లాడారు. మరిన్ని కార్యక్రమాలు నిర్వహించడానికి సహకరించాలని కోరారు. అదేవిధంగా ఎన్నికల ఇన్‌చార్జ్, జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, మల్లు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మండల, పట్టణ కమిటీల అధ్యక్షులను ఎన్నుకున్నారు. దేవరకద్ర నియోజకవర్గ అధ్యక్షుడిగా కొండ శ్రీనివాస్‌రెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడిగా పి.జగన్మోహన్‌రెడ్డి, పట్టణ కమిటీ అధ్యక్షుడిగా బండహన్మిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు సుధాకర్‌రెడ్డి, నాగార్జున రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

దేవరకద్ర: సమస్యలు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని గ్రామ పంచాయతీ కార్మికులు హెచ్చరించారు. శనివారం 24వ రోజు సమ్మెలో భాగంగా దేవరకద్ర మండల పరిషత్ కార్యాలయం ముందు కార్మికులు ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అన్ని సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, నాయకులు వెంకట్రాములు, ఆశన్న బుగ్గన్న, అంజనేయులు, వెంకటయ్య, ఏసు, బాలరాజు, స్వాతి, లక్ష్మీ, నాగమ్మ పాల్గొన్నారు.